# నా దారిలోనే...

''ఈ విషయాన్ని వెంటనే డిసైడ్ చేసుకోవలసి వచ్చింది. డాక్టరు గట్టిగా చెప్పారు ఇంతకంటే రోజులు గడిస్తే కష్టమని. ఎంతకీ ఆలోచన తెగదు. గాఢంగా అధ్యయనం చేయవలసిన రీసెర్చ్ సబ్జెక్ట్‌లాగా. ఎక్కడో మూలం దగ్గర నుంచి మొదలుపెట్టాలి.

పరిమళ నిద్ర కళ్ళతోనే ఆలోచిస్తూ పడుకొంది. తను తీసుకోవాలనుకున్న నిర్ణయంలో లూప్‌హోల్స్ ఏమున్నాయి?

''పమ్మీ, ఇది నువ్వనుకొన్నంత తేలిక కాదు. అలవాటైన బాటలో నడవటం ఈజీ. కొత్త బాట వేసేందుకు నీకు ఈ లైఫ్‌టైమ్ సరిపోదు. ఇది సమాజానికి అన్వయించే విషయం కాదు... ఈ ఆలోచన ఇంతటితో ఆపేయటం మంచిది'' అంటూ.

నిద్రలో ఉండగానే ఫోన్‌లో పిలిచి గట్టి వార్నింగ్ ఇచ్చింది శైల. పరిమళ మంచం మీంచి లేచి కిటికీ దగ్గర నిలబడింది. కొంచెం వళ్ళు తూలినట్టుగా ఉంది. ఫ్రెష్‌గా కళ్ళు తెరవకుండా ఏదో సిక్ ఫీలింగ్‌లో నిద్ర లేవటం కొత్తగా ఉంది. కిటికీలోంచి, ఇంకా వెలుగు పూర్తిగా రాని చీకటి తెరల్లోంచి ఎదురుగ్గా ఉన్న గుడిసెలు కనిపిస్తున్నాయి. అపార్ట్‌మెంటుల్లోంచి వచ్చే నీరంతా

ఆ గుడిసెల చుట్టూ నిలబడి అదేదో ఐలాండ్ లాగా ఉంది. తీరూతెన్నూ లేకుండా క్రిక్కిరిసి కట్టిన గుడిసెల మధ్య సన్న సన్నటి కాలిబాట. కాస్త మట్టిపోసి ఎత్తుగా ఉంచడం వల్ల బురద అంటుకోకుండా గట్టిపడి ఉంది. ఎత్తెత్తి అడుగులు వేసుకుంటూ నడవాల్సిందే. ఎదురుగ్గా ఉన్న గుడిసె అరుగు కింద ఒక కుక్క పిల్లల్ని పెట్టింది. ఇప్పుడే పుట్టి ఉంటాయి. అతి వేగంగా ఆ పిల్లల్ని నాకుతూ శుభ్రం చేస్తోంది తల్లి. పరిమళకు నవ్వొచ్చింది. ఈ కుక్కకు ఈ దిగుళ్ళున్నట్లు లేవు. పిల్లల బర్త్ సర్టిఫికెట్లు, ఎవరు తండ్రో ఎవరు తల్లో రుజువులూ, సాక్ష్యాలు... 'మనం ఇష్టం వచ్చినట్టు మనం బతుకుతాం' అని ఎంత గప్పాలు కొట్టినా నిలువుకాళ్ళతో ఎదురుగ్గా నిలబడ్డ సమాజ భయం. అబ్బ... ఎన్ని అభద్రతలో మనిషి జీవితంలో. కుక్క పిల్లలు పడుతూ లేస్తూ పాకుతున్నాయి తల్లి చుట్టూ. ఇంకా పాలు తాగటం మొదలుపెట్టినట్లు లేదు. ఒకళ్ళిద్దరు చిన్నపిల్లలు చేరారు. అందిట్లో తెల్ల మచ్చలున్న కుక్కపిల్ల ఎవరిదో, నల్లవూలు ఉండలా ఉన్నది ఎవరిదో వాటాలు వేసుకుంటున్నారు. నిజంగానే వాళ్ళు తీసుకుపోకుండా నిరోధించలేని నిస్సహాయతతో, తను కన్న పిల్లల్ని తాను రక్షించుకోలేని స్థితిలో, పిల్లల్ని కంటోంది ఆ కుక్క తల్లి. సొంతం అంటూ దానికేముంటుంది? కోరికను ఫీలయ్యే శక్తి, మహా అయితే తీర్చుకునే అవకాశం, పిల్లల్ని కనగలిగే శరీర ధర్మం , ఈ మూడూ ఉంటే సరిపోతుందా!

పరిమళ కళ్ళల్లో నీళ్ళు ఊరాయి.

నిజంగానే ఈ మూడూ వుంటే సరిపోతే ఇవ్వాళ తనకీ ధర్మసంకటం రాకపోను

కలుగబోయే బాధ తీవ్రత ముందే ఎందుకు అనుభవంలోకి రాలేదు?

ఒక రిక్షా ఆగింది. అందులోంచి తెల్లని లుంగీ కట్టుకున్న వ్యక్తి దిగాడు. చేతిలో చిన్న సంచి. రిక్షా పంపించేసి చుట్టూ చూసేడు. ఆ పిల్లల్ని ఏదో అడిగాడు. వాళ్ళు కుక్కపిల్లల రంధిలో ఉన్నారు. అతను వాళ్ళలో ఒకడ్ని చేయి పట్టుకు గుంజి, తట్టి మేలుకొలిపాక వాడు ఈ లోకంలోకి వచ్చి ఆ గుడిసెల సందుల వెంట చేయి చూపించాడు. ఇస్త్రీ లుంగీ, అతను యథాలాపంగా అటు రెండడుగులు వేశాడు. కాలిబాట కిందనే ఎండిన బురద మీద పాదం పడగానే అడుగు నుంచి బురద చిమ్మింది. ఆ బురదలోంచి జారిపడకుండా నిలదొక్కుకున్నాడతను. తెల్లని శుభ్రమైన లుంగీ నిండా డాగులుగా బురద. పరిమళ ఉలిక్కిపడింది. జీవితం చుట్టూ కూడా అటువంటి ఎండిపోయినట్టు కనిపించే ఊబి ఉంటుంది. తనలాటి ప్రయాణీకులు అందిట్లో ప్రయత్నపూర్వకంగానో, తెలియకో కాలు వేస్తే...

పరిమళ నెమ్మదిగా వెనక్కి వచ్చి మంచంమ్మీద పడుకొంది. పక్కని గది. కళాత్మకంగా

తెల్లని గోడ మీద ఒకే ఒక వాల్ పెయింటింగ్. ఒకవేపు వార్డ్ రోబ్‌లు, ఇంకోవేపు నల్ల చేవకర్రతో చేసిన మంచంమీద మంచుముక్క వంటి తెల్లని పరుపు. లాంప్ షేడ్ కింద గోడకు అటాచ్ చేసిన శంకులోంచి నాలుగైదు రెమ్మలు వేసిన మినీ ప్లాంట్. గదంతా పరుచుకున్న నీలి వెలుతురు. తన వంటి ఇంటీరియర్ డెకొరేటర్ ఇల్లు ఎలా ఉండాలో అలా. ఈ గదిలోకి అడుగుపెడుతూనే అవ్వాళ అతను ముగ్ధుడైపోయాడు. సంవత్సర కాలంగా సాగుతున్న స్నేహం. పెళ్ళి ప్రపోజల్స్. ఆ రోజు అనుకోకుండా దొరికిన ఏకాంతం. అతన్ని అభ్యంతర పెట్టవలసిన అవసరం కూడా కనిపించలేదు. ఒక రొమాంటిక్ మూడ్ ఫర్ ఏజెస్. బహుశా ప్రపంచంలో తొలి జంట ఎవరో వాళ్ళ దగ్గర నుంచి ఇదే తంతు జరిగి ఉంటుంది. కేవలం శరీరంతో మాత్రమే ఫీల్ అవగలిగిన ఆ అనుభవమే తనకి మొదటి అనుభవం. అతనూ ఆ మత్తులోనే ఉన్నాడు.

పమ్మీ నువు నాకు సొంతంగా దొరకడం నాకెంత హాపీగా ఉందో చెప్పలేను అన్నాడతను. ఆ రోజు అందిట్లో గొప్ప అర్థాలేవీ కనిపించలేదు. హృదయంలోంచి వీణలు మ్రోగటం వంటివి ఫీలయినట్టు... ప్చ్.

పరిమళ నిట్టూర్చింది.

ఆ తెల్లారిందగ్గర నుంచే తన జీవితం మారిపోయిందనిపించింది. నిద్ర లేస్తూనే అతన్ని ఊహించడం అదో థ్రిల్. పరిమళ లేచి మంచం మీద కూర్చుంది. ఏదో ఒక అసహనం. పక్కన పెట్టిన రిమోట్ చేతికి అందింది. అనాలోచితంగానే నొక్కినా... హఠాత్తుగా టి.వి. స్క్రీన్ మీద బొమ్మలు... బీటిల్స్ మ్యూజిక్. కంగారుపడి ఆపేసింది. మళ్ళీ అంతా ప్రశాంతత. ఇక్కడే తమాషా. తన రిమోట్ ఇంకోళ్ళ చేతుల్లో... ఎలా సాధ్యం. అసలు తనకెలా కుదురుతుంది. కనీసం ఐదారేళ్ళుగా అలవాటైన జీవితం.

విశ్రాంతిగా రాత్రిళ్ళు చదువుకుంటూ 'టీ'లు తాగుతూ, ఫాస్ట్‌ఫుడ్స్ తింటూ, ఎప్పటికో నిద్రపోతూ సోమరిగా గడపటం. తొందరగా పనులు చేయటం. రోజుల తరబడి బ్రెడ్‌టోస్ట్, జామ్‌తో బతకడం. తీరిక దొరికితే అదే పనిగా వంటలు. అవన్నీ వారాల తరబడి ఫ్రిజ్‌లో మురిగిపోవడం. అంతా స్వేచ్ఛగా ఎగిరే తూనీగ వంటి జీవితం. ఆఫీసుకు వెళ్ళగానే ఏదో ఒక ఆఫర్ రెడీగా ఉంటుంది. చక్కని పువ్వులు, కొమ్మలు, ఆకులు, కలెక్ట్ చేసుకోవటం. తనకో అసిస్టెంట్. ఏ పెళ్ళి కోసమో, శోభనం కోసమో, పుట్టిన రోజు కోసమో డిజైనింగ్ చేయటం, లేదా ఏ కొత్త ఇంటి కోసమో డెకరేషన్ చేయటం. చేతినిండా డబ్బు, హోండా ఎక్కి స్నేహితులతో వేగంగా పరుగులు తీస్తూ షికార్లు, డబ్బులు, లెక్కలు సంపాదన, వీటన్నింటి మధ్యన అతను. తమాషా ఏమిటంటే తన జీవితమూ అచ్చం అతని లాగానే. కంప్యూటర్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం. రెండు చేతులా జీతం, కులాసా జీవితం. అందరం

కలిస్తే అక్కడే ఒక జలపాతం తుళ్ళి పడుతుంది. తన చుట్టూ, తన వృత్తి చుట్టూ, తన స్నేహితుల చుట్టూ, అభిమానుల చుట్టూ, జీవిత విధానం చుట్టూ ఆంక్షలు! ఈ వృత్తిలో ఎంతోమంది ఫ్రెండ్స్. కొత్త పరిచయాలు, బిజినెస్ కాంట్రాక్ట్స్. సిటీక్లబ్బుల్లో మెంబర్‌షిప్‌లు, ఎప్పుడూ పని వత్తిడి. తన బుల్లి మారుతీ నిండా ఎప్పుడూ పూల బొకేలు నిండినట్టు తన ఆలోచనల నిండా ఎప్పుడూ రంగులు, కాంబినేషన్లు, అలంకరణలూ డబ్బూ... ఇదంతా హఠాత్తుగా ఎలా మాయమై పోతుంది? సంపాదించింది చాలదా? అంటే మరి తనూ అంతేగా. ఉద్యోగం ఒకళ్ళకి అవసరం. ఇంకోళ్ళకి అనవసరం ఎలాగయిపోతుంది. రెండు వారాల క్రితం అతనికి ఒక ఫారిన్ ఛాన్స్ వచ్చే ఆఫర్ తగిలింది. అంతే, రెండు రోజులు అబ్స్కాండ్. మనిషి కనీసం ఫోన్‌లో కూడా పత్తా లేడు. పరిమళ అనే మనిషి ఆ రెండు రోజులు అతని మనసుని తాకనే లేదు. మరి తను అలా ఉంటే అసహ్యాంటు. పనిలో పడితే, ఇతరులని పట్టించుకోవంటాడు.

తల్లి గొంతు వినిపించింది. ఒక చివరి బాల్కనీలోంచి. రోడ్డు దాటుతోన్న నాన్నని, అక్క పావనీ హెచ్చరిస్తోంది. వాళ్ళు వినేవినరు ఈవిడ గోలని. అయినా తను మటుకే అలా భద్రంగా కుటుంబాన్ని కాపాడుతున్నాననే భ్రమతో... అవును భ్రమ మాత్రమే.

'చాలా తప్పు పమ్మీ. ఇలా ఆలోచించటం. చాలా తప్పు. మేమంతా నీలాగే స్వేచ్ఛగా హాయిగా పెరగలేదా? పెళ్ళాడలేదా? మీ నాన్న నాకెంత మంచి భర్త...' అన్నది అమ్మ.

అబ్బో గొప్ప సొద. నాన్న నాకు మంచి నాన్న అవును. అమ్మకి మంచి భర్త ఎలా అవును? అసలు అమ్మ గనుక అనగూడదు కానీ, ఒక వ్యక్తిత్వం వున్న మనిషిలా ప్రవర్తించిందా? నాన్న ఇచ్చిందే జీవితం, డబ్బు, సుఖాలు అన్నీ... పోనీ అలా ఉదారంగా ఏవీ ఇవ్వలేదు. అన్నింటికీ లెక్కలు. పోనీ ఆవిడ పెత్తనంలోనే పిల్లల చదువులు, పెంపకం, ఇళ్ళు, నగలు కొనటం, సేవింగ్స్ ఓ.కె. ఇవన్నీ అమ్మే తెలివిగా సమర్థిస్తోంది కనుకే నాన్న నిశ్చింతగా వదిలేసి క్లబ్బుకి పోయేవాడు. అమ్మ అలా వెళ్ళగలదా? అదేమంటే నేను ఇన్నర్ వీల్ మెంబర్‌ని కాదా అంటుంది. ఏం మెంబరూ? ఒక్క పనీ పనికి వచ్చేది కాదు. ఎవరికీ మేలు జరగని సంఘసేవ. ఆ జనం ఎవరో, ఎందుకో తెలియకుండా ఏదో ఒక మురికివాడకి పోవడం, అక్కడ వాళ్ళ అవసరాలకు స్పందించి ఏదైనా వర్క్ చేస్తే అదో రకం. కాటరాక్ట్ ఆపరేషన్లూ, ఉచితవైద్య శిబిరాలు, క్లబ్‌లో ముగ్గులు, వంటల పోటీలు, ఆడంబరాల ప్రదర్శనలూ సోది. మిసెస్ వర్మ, మిసెస్ సుందరం, చివరికి అమ్మ కూడా ఓన్లీ మిసెస్ రావ్. పాపం ఆవిడ పేరు మీనాక్షమ్మ. నాన్న చిన్నప్పుడే ఇందిర అని మార్చేశాడు. ఆ పేరంటే నాన్న కిష్టం అంటుంది అమ్మ నవ్వుకుంటూ. అమ్మమ్మ గావును మీనా అని పిలుస్తుంది అమ్మని. మిగతా అంతా ఇందూ, ఇందిరే.

పరిమళకు తలనొప్పి మొదలైంది. కళ్ళు తిరుగుతూ వికారం పెట్టేస్తోంది. బాత్‌రూమ్

చుట్టూ వాష్టింగ్ సెన్సేషన్‌తో పరుగులు పెట్టడం అవుతోంది. పొద్దుటే అక్క క్లాసు తీసుకుంది. కాలేజీ లెక్చరర్ ఆవిడ. పాఠాలు అలవాటే. 'గౌరవం, పరువు, ప్రతిష్ఠ, అతని కులం, గోత్రం, గొప్ప గుణం, గొప్పతనం.'

పరిమళ కాళ్ళు చాపుకుని విశ్రాంతిగా కూర్చుంది. మనసులో ఓ నల్లని బ్లాక్‌బోర్డు. కళ్ళు మూసుకుని లెక్కలు వేయటం మొదలుపెట్టింది.

'తన ఆలోచనల్లో ప్రాక్టికల్‌గా ఉన్న శాతం. అమ్మ చెప్పినట్టు, అక్క చెప్పినట్టు ప్లస్‌లూ, మైనస్‌లూ వరుసగ్గా డస్టర్‌తో తుడిచేస్తూ పోతే చివరికి మిగిలింది పరిమళ అన్న పేరొక్కటే. 'అవునూ తన ముందు, తన వ్యక్తిత్వం ముందు తన స్వేచ్ఛ ముందు అన్నీ తుడిచేయ దగ్గవే. కానీ అన్నీ తుడిచేస్తే వచ్చిన ఫెన్సింగులు లేని విశాలమైన ఆవరణ. అందుట్లోకి అడుగుపెడితే ఏమవుతుంది. కంచెలు ముఖ్యమేనా? చుట్టూ గోడలుంటే అదా భద్రత! పెళ్ళి ఈ భద్రత ఇవ్వగలదా? అది జైల్లా ఉండదా? ఇలాటి వందలాది, కోట్లాది జైళ్ళు ప్రపంచం నిండా అభేద్యంగా కట్టి ఉంటే ఆ వాతావరణానికి యావన్మందీ అలవాటుపడి వుంటే, గోడలు వద్దంటే ఏమవుతుంది? సుఖం గురించే తెలిస్తే దుఃఖం భరించలేనిదవుతుంది. అసలు సుఖం అన్న పదమే లేకపోతే దుఃఖం సాంద్రత కొలతలేమిటి? ప్రపంచం నిండా నిండి వున్న దుఃఖంలో ప్రజలు సంతృప్తులై ఉన్నారు. సరిగ్గా అటువంటి స్థితిలో కోట్లాది మంది స్త్రీలంతా హాయిగా బతుకుతున్నారు. వాళ్ళకి స్వేచ్ఛ తెలియదు. సంతోషం పట్టదు. మిగతా ఏ మానవ లక్షణాల పట్ల అవగాహన ఉండదు. అలాటి కొందరికి చటుకు తన నిర్ణయం ఒప్పుకాకపోతే అది తప్పెలా అవుతుంది. లేదా వాళ్ళని అల్లాగే వుంచిన వాళ్ళు తప్పు పడితే మనకి కొత్తగా పోయేదేముంది. ఎవరి అవసరాల కోసమో, సౌకర్యాల కోసమో మనం కాదు కదా!

పరిమళకి ఉత్సాహం వచ్చింది. ఫోన్ తీసింది. అటు నుంచి డాక్టర్ శైలు.

'నేను నిర్ణయించుకున్నాను శైలా. పాపాయిని కంటాను'

శైల నవ్వేసింది.

'గుడ్... మరి పెళ్ళెప్పుడు?'

పరిమళ విశ్రాంతిగా వెనక్కి వాలింది.

నేను పాపాయిని గురించి మాట్లాడుతుంటే నువ్వు పెళ్ళి గురించి అడుగుతావే. నీ ఓ.పి అవగానే వచ్చి ఇవాళ నాతో ఉండు. నేను ఎలాటి ఫుడ్ తీసుకోవాలో, ఎలాటి ఎక్సర్‌సైజ్ చేయాలో, పాపాయి ఎలా ఆరోగ్యంగా ఉంటుందో, ఈ రాత్రికి చెప్పుకొందాం'

'అదేమిటే బాబూ, కాస్త అర్థం అయ్యేలా చెప్పు'

ఇందులో అర్థం కానిది ఉందా? పాపాయి నాతో వుందని తెలిసినపుడు నేనెంత సంతోషపడ్డానో, నాకిప్పుడు అంతగానూ సంతోషంగా ఉంది. నాకు నా అంత అందమైన పాపాయి పుడుతుందన్నావు. ఎస్. నా పాపాయి నాకు కావాలి. అతనితో నాకేం లేదు. అదంతా నిన్నటి గతం. అతనికి నాకు దోస్తీ లేదు. పెళ్ళి చుట్టూ ముడుల్ని నేను సహించలేను. నాకు పెళ్ళే వద్దు.

'ఎవరేనా మొహం మీమ్మద ఊస్తారు. పెళ్ళి కాకుండా... పిల్లల్ని కంటావా? తలెత్తుకుని ఎలా తిరుగుతావు. ఏమని చెపుతావు. బిడ్డకు తండ్రి ఎవరని అడిగితే...'

'పది నెలలు నేనే మోస్తానే. రక్తం ఓడ్చి నేనే తిప్పలు పడి బిడ్డను కంటాను. అది నా బిడ్డ కాక ఇంకొకళ్ళ పేరు మీద చలామణి అవటం అవసరం అంటావా'

'నువ్వలా గందరగోళంగా ఆలోచిస్తే కష్టం. మనం అరణ్యంలో లేము. మనుష్యుల మధ్యన బతుకుతున్నాం. మనకో పద్ధతి ఉంది'

'అవునమ్మా శైలా. కాస్త ఓర్పు, ఓపికా తెచ్చుకో. ఈ పద్ధతి వల్ల ఎవరిక, ఎటువంటి లాభం! నీకా? నాకా? ఎవరి సౌకర్యం కోసమో ఏర్పాటు చేసిన ఈ పద్ధతుల పరదాల్లో నాకు ఊపిరి ఆడటంలేదు. ఒకళ్ళ మీద ఒకళ్ళు ఆధారపడే స్థితి కల్పించి, ఘోషాలు సృష్టించి, వాళ్ళని నిస్సహాయులను చేసి వాళ్ళకి శిక్ష వంటి కుటుంబాన్ని రూపకల్పన చేస్తే, దాన్ని నేను తగిలించుకోవాలంటావా?

'కుటుంబం శిక్షనా...'

అవును, మన లాటి మోడ్రన్ అమ్మాయిలు, ఇంకా మాట్లాడితే కెరీరిస్టులు, గతంలో లేరు. పాతతరం వాళ్ళకి చదువులు, ఉద్యోగాల కంటే సహించటం, భరించటం తెలుసు. వాళ్ళ కోసం ప్రత్యేకం అని కేటాయించిన దాన్ని నేను బద్దలు చేస్తా. ఒక కొత్త ఇల్లు సృష్టిస్తాం.

'ఓహో మొగుడు లేకుండా పిల్లల్ని కనా...'

శైల ఉక్రోషం చూసి పరిమళ నవ్వేసింది.

''మైడియర్ శైలా. ఆ విషయం కూడా సాధ్యమేనని నీకే బాగా తెలుసు. నేను ఆర్కిటెక్ట్‌ని. సామాన్యంగా ఉన్న వాతావరణాన్ని అందంగా, కొత్తగా తీర్చిదిద్దటం నా వృత్తి. ఇప్పుడో!! ఎదురుగ్గా ఉన్నది నా జీవితం. దాన్ని అలంకరించడం మొదలు పెడతాను. ముందుగా నా పాపతో నేను అందిట్లో అడుగు పెడతాను. ఇది నా వ్యక్తిత్వం. నేను అభిలషించిన జీవితం. ఇదే అందరికీ మార్గదర్శకం కావాలని నేను చెప్పను. నా సమస్యకు నాకు దొరికిన పరిష్కారం ఇది. ఈ ఇంట్లోనే మా అమ్మ, మా అక్కల జీవితాలు నా కళ్ళెదురుగా ఉన్నాయి. వాళ్ళు భద్రమహిళలు. వాళ్ళందరి

మధ్యన నేను నా పాపాయి. ఆ కొత్త జీవితం ఎలాగుంటుందో చూద్దాం. పరిమళ ఫోన్ పెట్టేసింది. శంఖంలోంచి పైకి లేచిన పచ్చని కొమ్మలు గాలికి నెమ్మదిగా కదిలాయి. పరిమళ విశ్రాంతిగా పడుకుంది.

'చాలా ప్రశ్నలు, చాలా సందేహాలు... ఫర్వాలేదు సమాధానాలు వెతుకుతాను'

పరిమళ కళ్ళు మీదికి నిద్ర వచ్చేసింది.

★

ఆంధ్రజ్యోతి వీక్లీ

***12.6.1998***